## భవిష్యజ్జాతక కథలు



అవడానికేముంది? నీ దగ్గిర మామూలుగానే డబ్బుండదు ఇప్పటి లాగానే అప్పుడు. ఓ రోజున గబగబా అప్పులన్నీ తీర్చి అవతల పారెయ్యడమే గాక అప్పుల వాళ్లందరి మొహాలు బద్దలయ్యేలా విసరికొట్టి వాళ్లకి యెదురప్పులుకూడా యిచ్చి ఏడిపించేటంత ధనికుడివి కావాలన్న దురాశ కొద్దీ ఓ రోజు పొద్దున్నే మంచిమాట చేసుకొని చిన్న లక్షాధికారింటికి వెళ్లి ఐదొందలు అప్పుతీసుకుని, పెద్ద కోటీశ్వరుడింటికి బయలుదేరుతావు. ఓ షిర్లాగారింట చేబదులు అడగాలని వెళ్తూంటావు. ఆ రోజున షిర్లాగారు కారు నచ్చక సరదాకి రిక్షామీద కొంచెం దూరం వెళ్తారు. రిక్షాకి కూలి ఐదొంద లివ్వడానికి చిల్లరలేక, లక్షరూపాయల నోటుకి చిల్లర దొరక్క "వాట్" అనుకుంటూ వుంటారు. ఛేంజి నాదగ్గరుందని అందాకా ఆ పక్కనే వున్న నువ్వు ఆ డబ్బులిచ్చి రిక్షాని పంపేస్తావు. అనక ఆయన నీ ఫ్రెండయిపోయి, ఎపుడేనా లక్షా కోటీ యిబ్బందయితే మొహమాటపడకు పుచ్చుకో అంటాడు. అంటూ ఓ కోటి యిస్తాడు. ఇంకోటిమ్మంటావు నువ్వు. గంటసేపట్లో అప్పు తీరుస్తానంటావు. ఆ రెండుకోట్లూ ఇలా ఆ గంటా పట్టుకునేసరికి వూళ్ళో పలుకుబడి దారుణంగా పెరిగిపోయి పెద్ద-డబ్బు-గాడిలో పడిపోతావు. అపుడు ఖంగారులో షిర్లాగారే నీ దగ్గర పది లక్షలు అప్పు తీసుకుంటాడు కూడా.

ఈ విధంగా ఆలోచించుకుంటూనే వోపక్క అప్పులవాళ్లకు అందకుండా, వాన చినుకులమధ్య నకులుడు గుర్రం తోలినట్లు నీ చేతిలో డబ్బు పట్టుకు వెళ్తూ వుంటావు. అయితే నీ కల, పతాక సన్నివేశానికి వచ్చేసరికి, ఆ కలలో నీ చేత డబ్బును ఏ షిర్లావో అడిగాడనుకొని అందించ బోయినట్టు పట్టుకుంటావు. అపుడు యెక్కడనించో అప్పారావు వచ్చి రెండొందలు చేబదులు తీసుకొని, నీదగ్గర డబ్బుందని గాలిలో వూదేవరకు, అప్పులవాళ్లు వడగళ్లలా వచ్చిపడి ఉన్నది ఊడ్చుకుపోతారు.

ఓ సింహాద్రీ: ఇపుడు ఆ బుద్దే ప్రదర్శించి దొరకబోయే అప్పును నమ్ముకుని నా పుట్టలో ప్రవేశించావు గాన తెలపడమైనది అని సుబ్బన్న ఊరుకున్నాడు.

సింహాద్రి తెల్లబోయి తేరుకుని సెహబాసు, ఔనుగాని సుబ్బన్నా నీ కెలా తెలుసు ఇవన్నీ, ఈ జన్మలూ ఫిరాయింపులూ కథా కమామీషూనూ? అన్నాడు.

నీవు నేర్పిన విద్యయే అన్నాడు సుబ్బన్న వినమ్రత ఉట్టిపడేలా.

నాగలక్ష్మికి ఈ వరస చూడగా ఒళ్ళు మండింది. బావుంది నీ వినయం నువ్వూ. అనక కథయ్యేటపుడు అంతా కలిసి ఫోటోగ్రాఫు దిగుదురుగాని, ముందర వాళ్లని లేవగొట్టు అంది భర్తతో.

ఓ నడికారు చీమ, గొంతు సవరించుకుని కలుగజేసుకుంది. అయ్యా సుబ్బన్నగారూ అలా చెప్పొదు మాటలు వినరాదు, చెడేరు.

★ ★ ★